పరిషత్‌పై పచ్చ పెత్తనం!

- మేము చెప్పిందే చేయాలంటూ అధికారులకు టీడీపీ నేతల హుకుం
- నందలూరులో అపహాస్యంపాలైన ప్రజాస్వామ్యం


ఎంపీపీ చాంబరులో అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

రాజంపేట : నందలూరు మండల పరిషత్‌పై పచ్చ పెత్తనం పేట్రేగిపోయింది. ఎంపీపీ, మండల ఉపాధ్యక్షులు, ఎంపీటీసీలు ఉన్న లేనట్లే అన్న రీతిలో పచ్చనేతలు బుధవారం నందలూరు అటవీ శివార్లలో ఉన్న మండల పరిషత్ కార్యాలయంలో వ్యవహరించిన తీరు సర్వత్రా విమర్శలకు దారితీసింది. మండల పరిషత్‌కు వచ్చిన వారిలో ఎవరూ ప్రజాప్రతినిధులు, ప్రోటోకాల్ లేదు. వీరికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి సౌభాగమ్మ, తదితర విభాగాల అధికారులు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి చాంబరులో కూర్చోపెట్టి మండల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించేలా వ్యవహరించడం పంచాయతీరాజ్ చట్ట విరుద్ధం. ఎంపీపీ అనుమతి లేకుండా ఆయన చాంబరులో అధికారులతో మండల పరిషత్ అభివృద్ధి పనులపై పచ్చనేతలు సమీక్షించారు. మేము చెప్పిందే అధికారులు వినాలి. తమదే ప్రభుత్వం, ఎంబుక్‌లు చేయరాదు, పనులకు నిధులు మంజూరు చేయరాదు. అలానే తమకు తెలియకుండా ఏ పనిపెట్టరాదు అంటూ జిల్లా కలెక్టర్ తరహాలో హుకుం జారీ చేశారు.

అపహాస్యంపాలైన ప్రజాస్వామ్యం

ప్రజల ఓట్లతో ఎన్నికైన ఎంపీపీ, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల ఉపాధ్యక్షులతో ఇక పని అక్కర్లేదు తాము చెబితే మండల పరిషత్ పాలన జరగాలనే విధంగా అధికారులకు పచ్చనేతల హుకుం జారీచేశారు. ఈ విషయంపై ఎంపీడీఓ సౌభాగ్యమ్మ వివరణ కోరగా టీడీపీ నేతలు ఆఫీసుకు వచ్చారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మేడా విజయశేఖర్‌రెడ్డి, యెద్దల విజయసాగర్, సయ్యద్‌అమీర్, సర్పంచి జంబు సూర్యనారాయణ, ఈఓఆర్డీ ప్రకాశ్ తదితర పచ్చనేతలు పాల్గొన్నారు. మండలంలో జరుగుతున్న వరుస సంఘటనలతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందనే విమర్శలు వెలువడ్డాయి.

అధికారులకు మింగుడుపడని పచ్చనేతల వైఖరి

మండల పరిషత్‌పై పచ్చపెత్తనం తీరు అధికారులకు మింగుపడటంలేదు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులకు అభివృద్ధికి సంబంధించి అధికారులు చెప్పాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఎటువంటి ప్రోటోకాల్ లేకపోయిన పచ్చనేతలు తీరుతో అధికారులు సతమతమవుతున్నారు. పచ్చనేతల ఒత్తిడితో బదిలీ కోసం పరిషత్ అధికారులు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మండల పరిషత్ సంఘటనపై జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి పరిషత్ ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా సన్నద్ధమవుతున్నారు. మండలపరిషత్ అధికారులపై అధికార పార్టీ నేతలు పెత్తనం చేయడం తగదని, ఇలాగా కొనసాగితే తాము ఇక్కడ పనిచేయలేమని వాదన వినిపిస్తోంది.

దేవదాయశాఖ భూములు ఆక్రమిస్తే చర్యలు


విలేకరులతో మాట్లాడుతున్న అధికారి విశ్వనాథం

గాలివీడు : అన్నమయ్య జిల్లాలో దేవాదాయ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తప్పవని జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారి విశ్వనాథం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కోదండ రామాలయం, గాలివాటమ్మ ఆలయాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1663 ఆలయాలుండగా, 16 ఆలయాలు మాత్రమే రూ.2 లక్షలకు పైగా ఆదాయం కలిగి ఉన్నాయన్నారు. 9761 ఎకరాల దేవదాయ భూములు ఉన్నాయని, 460 ఎకరాలు సేవకుల ఆధీనంలో ఉన్నాయని తెలిపారు. ఇంకా 5567 ఎకరాలు భూమిని గుర్తించాల్సి ఉందన్నారు. 1170 ఎకరాల భూమి ఆక్రమణలో ఉన్నాయని, 2542 ఎకరాల భూములు సాగుకు లీజుకు ఇచ్చామన్నారు. 268 ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకం అమలు జరుగుతోందన్నారు. అర్హత కలిగిన ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం అమలుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈఓ కొండారెడ్డి పూలకుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డి, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, కుమార్ రెడ్డి, చెన్నయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పదవీ విరమణ.. సన్మానం


వీరనాగమ్మను సన్మానిస్తున్న దృశ్యం

సుండుపల్లె : మండలంలోని పెద్దమాదిగపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేసి ఆగస్టు 31న జి.వీరనాగమ్మ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆమెను సుండుపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.జయన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బి.వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ 35 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో చాలా బాధ్యతాయుతంగా పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో రవీంద్రనాథరెడ్డి, నాగరాజు నాయక్, సిద్దు నాయక్, నరేంద్రరాజు, మురళీధర్ రాజు, శాంతి, హరికుమార్, అశోక్ కుమార్ రాజు, ఆంజనేయులు, సీఆర్‌పీ గంగయ్య, పాఠశాల కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి టౌన్ పరిధిలో బుధవారం పంచాయతీ సిబ్బంది కుక్కలను పట్టుకున్నారు. దీంతో పట్టణ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మధ్యకాలంలో 18 మంది కుక్కకాటుకు గురై ఆసుపత్రి పాలయ్యారు. దీంతో పంచాయతీ సిబ్బంది కుక్కలు పట్టుకోవడంతో మండల కేంద్రం వాసులు హర్షం వ్యక్తం చేశారు. 50కు పైగా కుక్కలను పట్టుకొని ట్రాక్టర్ సహాయంతో పట్టణానికి దూరంగా వదిలేసినట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు.

పేదలకు భూములు, రేషన్‌కార్డులు ఇవ్వాలి

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని పేదలకు వ్యవసాయ భూములు, ఇంటిస్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఐ నాయకులు కోరారు. బుధవారం ఆ పార్టీ రాష్ట్ర నాయకుల పిలుపుమేరకు వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పండుగోలు మణి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్యల ఆధ్వర్యంలో పేదలతో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దార్ల రాజశేఖర్, వినయ్, పెంచలయ్య, ప్రకాష్, సోనీ, ఈశ్వరమ్మ, షాకీర్, అంజమ్మ, గౌరమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులలో సృజనాత్మకతను పెంచాలి

పుల్లంపేట : విద్యార్థులలో సృజనాత్మకతను పెంచేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేసినప్పుడే వారిలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీయవచ్చని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రమణ పేర్కొన్నారు. బుధవారం ఐదోతరగతి విద్యార్థులచే మానవుని అవయవాల వ్యవస్థ పాఠ్యాంశంలో భాగంగా విద్యార్థులచే చిత్రాలు గీయించారు. అగ్గిపుల్లలతో అస్థిపంజరం, దినుసులతో జీర్ణవ్యవస్థ, బీన్స్‌తో మూత్ర పిండాలు, బెలూన్ స్ట్రాతో ఊపిరితిత్తులు చిత్రాలు గీచిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు చిత్రలేఖనంలో పాల్గొనడం వలన వారిలోని మేధాశక్తిని బయటకు తీయవచ్చన్నారు.

భూ ఆక్రమణలపై విచారణ

సిద్దవటం(ఒంటిమిట్ట): పెద్దపల్లి గ్రామం సర్వే నెం-568/5లో 1.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. సదరు భూమిని గత 12 సంవత్సరాల నుంచి ఆక్రమణలో ఉందని కడప కలెక్టర్‌కు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు అందడంతో ఆర్డీఓ వెంకటపతి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులతో కలసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. విచారణలో ఇరు వర్గాల అభిప్రాయాలు తీసుకుని ఒక నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలియజేశారు.

అంగన్‌వాడీలకు కందిపప్పును సరఫరా చేయండి

రాయచోటి అర్బన్ : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పును వెంటనే సరఫరా చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల పరిధిలోని సెంటర్లకు గత 2 నెలలుగా కందిపప్పు సరఫరా కావడం లేదన్నారు. సకాలంలో పౌష్టికాహారం అందకపోతే గర్భిణులు, బాలింతలకు గ్రోత్‌రేట్ ఎలా పెరుగుతుందంటూ ఆయన ప్రశ్నించారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న పలురకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి

ఒంటిమిట్ట : మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మండలంలోని అన్ని శాఖల అధికారులతో మండలంలో అభివృద్ధి పనులపై సమీక్షించారు. సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇది ఇలా ఉండగా సమావేశం జరుగుతుండగా కొంత మంది ప్రజాప్రతినిధులు వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డయ్య, తహసీల్దార్ రమణమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గుర్రంకొండ వీఆర్‌ఓపై చర్యలు తీసుకోండి

రాయచోటి అర్బన్ : గుర్రంకొండ పాత ఇందిరమ్మ కాలనీకి చెందిన దళితుడు బుడ్డపల్లె కదిరయ్యపై వేధింపులకు పాల్పడుతూ అన్యాయం చేయతలపెట్టిన రెవెన్యూ అధికారి ముక్తియార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కలెక్టరేట్ ఏడీ నాగభూషణంను కలసి ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వి.రెడ్డిసుధాకర్, పి.గంగులయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకం


పోటీల్లో వెయిట్ లిఫ్ట్ చేస్తున్న నాగరాజ

వీరబల్లి : అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో వీరబల్లి మండలం కల్లేవాండ్లపల్లికి చెందిన కొర్లకుంట నాగరాజ బంగారు పతకం సాధించారు. నేపాల్‌లో ఆగస్టు 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు జరిగిన 390 కిలోల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 350 మంది పాల్గొన్నారు. ఈ పోటీలలో బంగారు పతకం సాధించిన నాగరాజుకు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శివతివార్య బహుమతి ప్రదానం చేశారు. నాగరాజ కల్లేవాండ్లపల్లె ప్రాథమిక, వీరబల్లి ఉన్నత పాఠశాలలో పదివరకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రైతుల భూములకు ఢోకా లేదు


విద్యార్థులకు పాఠాలు చెబుతున్న వైఎస్సార్ జిల్లా కలెక్టర్ లోతోటి శివశంకర్

సిద్దవటం(ఒంటిమిట్ట) : మండలంలోని గుండ్లమూల గ్రామంలో కాలుష్య నియంత్రణ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం బుధవారం కలెక్టర్ శివశంకర్ మూలపల్లి గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. పెన్నా పరివాహక ప్రాంతాలలో ఇసుక తవ్వకాలు వల్ల భూముల కోతకు గురవుతాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇసుక తవ్వకాలు వల్ల భూములకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వ నిబంధన ప్రకారం తవ్వకాలు జరుగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. అక్టోబర్ నెలలో మరోమారు గ్రామ సభ ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పర్యావరణ శాఖ ఇంజనీర్ శ్రీనివాసరావు, కడప ఆర్డీఓ వెంకటపతి, మైన్స్ శాఖ డీడీ రవి ప్రసాద్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ విమల, అసిస్టెంట్ జియాలజిస్టు శ్రీనివాసులు, తహసీల్దార్ మురాషా వలి, ఎంపీడీఓ జవహర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బడిపంతులుగా మారిన కలెక్టర్

మూలపల్లి గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌ను కలెక్టర్ లోతోటి శివశంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. కాసేపు ఆయన బడిపంతులుగా మారి విద్యార్థులకు విద్యాబోధనలు చేశారు. సర్కారీ బడిలో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గడంతో హెడ్‌మాస్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

సిద్దవటం పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ


పోలీస్ స్టేషన్ ను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

సిద్దవటం(ఒంటిమిట్ట) : సిద్దవటం పోలీస్ స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన పిటీషన్‌లో తీసుకుని వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకోవాలని ఎస్ఐ చిరంజీవిని ఆదేశించారు. కొత్తగా వచ్చిన ఎస్ఐ ఫిర్యాదుదారుల పిటిషన్లను రిజిస్టర్‌లో పరిశీలించి ఎలా పరిష్కరించాలో చూడాలన్నారు. పిటిషన్‌కు అనుకూలంగా జరిగిందా లేదా అనే విషయాన్ని పరిశీలించాలన్నారు. పాత నేరస్తులతో, సస్పెక్ట్‌లతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి జీవన విధానం, డబ్బు ఎలా సంపాదిస్తున్నారో అడిగి తెలుసుకోవాలన్నారు. నేరాలలో పాల్గొంటున్నారా లేదా అనే సమాచారాన్ని వారితో మాట్లాడి తెలుసుకోవాలన్నారు. వారి వ్యక్తిగత కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట రాముడు, ఒంటిమిట్ట సీఐ కృష్ణం రాజు నాయక్, ఎస్సై చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీ రాజకీయాలను వారసత్వంగా పుణికి పుచ్చుకోవాలి


మాట్లాడుతున్న ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట : నిజాయితీతో కూడిన రాజకీయాలను వారసత్వంగా పుణికిపుచ్చుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. నారమరాజుపల్లె వద్ద ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ కాంపిటీషన్‌ను ఆయన కేంద్రీయ విద్యాలయ ప్రాచార్యులు నీరజ్‌కుమార్, శ్రీవాస్తవల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమూనా పార్లమెంట్‌లో సమకాలీన సమస్యలపై చర్చిస్తూ తమ ప్రతిభను కనబరిచిన చిన్నారులు భవిష్యత్తులో నిజమైన పార్లమెంట్‌లో అడుగుపెట్టి దేశానికి సేవచేయాలని ఆశాభావం వ్యక్తంచేశారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ను తెలియజేయండి


మాట్లాడుతున్న సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

లక్కిరెడ్డిపల్లి : గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలను విద్యార్థులకు తెలియజేస్తూ ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. సాక్షి పత్రికలో ప్రచురితమైన లక్కిరెడ్డిపల్లి బీఆర్ అంబేద్కర్ గురుకులం (బాలికలు) పాఠశాలలో 5వ తరగతి విద్యార్థినిపై జరిగిన అత్యాచారం ఘటన అంశంపై బుధవారం స్థానిక గురుకుల పాఠశాలలో ఆయన సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసాతో కలసి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్వయంగా పిల్లలతో మాట్లాడారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలను విద్యార్థినులకు తెలియజేస్తూ ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. టోల్ ఫ్రీ నెంబర్లు 100, 1098, 15100లపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే లక్కిరెడ్డిపల్లి మండల న్యాయసేవా సమితిని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రబాబు, రెవెన్యూ అధికారులు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించండి

సివిల్, క్రిమినల్ కేసులపై జాతీయ లోక్ అదాలత్‌లో సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్, లక్కిరెడ్డిపల్లి సివిల్ కోర్టు జడ్జి షేక్ ఫైజున్నీసాలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టులో లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు పోలీస్ సిబ్బంది సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో వివిధ మండలాల ఎస్ఐలు, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా అడుగులేద్దాం


మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

రాజంపేట టౌన్ : భారతీయ జనతా పార్టీని వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో సొంతంగా అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాజంపేట పట్టణంలోని న్యూ ఆంధ్రకళ్యాణ మండపంలో బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న పొత్తు ధర్మాన్ని పాటిస్తూనే 2029లో జరిగే ఎన్నికల నాటికి గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ బలోపేతం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పి.రమేష్‌నాయుడు, గోపాల్‌రెడ్డి, పి.సురేష్, చంద్రారెడ్డి, కిరణ్, లోకేష్, షబ్బీర్ అహమ్మద్, నాగేశ్వరరావు, పి.కృష్ణయాదవ్, పాపయ్యలు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సుండుపల్లె : మండల పరిధిలోని రాయవరం పీహెచ్‌సీ పరిధిలోని గుండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాన్ని ఎంపీహెచ్ ఈఓ వీరనారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పాలు, గుడ్లు, ఆకు కూరలను క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహార పదార్థాలను తీసుకోవాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం వలన తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పును చేయించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం నాగరత్నమ్మ, సీహెచ్‌ఓ సుకన్య, అంగన్‌వాడీ టీచర్ సుజాత, రేణుక, ఆశ వర్కర్లు మల్లేశ్వరి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య ఫార్మసీ కాలేజీలో..

రాజంపేట : అన్నమాచార్య ఫార్మసీలో జాతీయ పోషక ఆహార దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.స్వర్ణలత మాట్లాడుతూ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల మెరుగైన ఆరోగ్య లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోషకాహారలు తయారుచేసి ప్రదర్శించారు. రాగివడ, బీట్రూట్ లడ్డు, పీనట్ మిల్క్‌షేక్, రాగిసంగటి, ఫ్రూట్‌సలాడ్, వెజిటబుల్ సలాడ్, క్యారెట్ హల్వా లాంటి ఆహారపదార్థాలు నోరూరించాయి. కార్యక్రమంలో అధ్యాపక బృందం డా.ద్వారకనాథరెడ్డి, ప్రదీప్, ప్రమోద్, అనిత, వాసవీదేవి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులను వాడరాదు

రాజంపేట రూరల్ : వరి సాగులో మోతాదుకు మించి ఎరువులను వాడరాదని కేవీకే శాస్త్రవేత్త వీరయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని తాళ్లపాక గ్రామంలో సాగు చేసిన వరి పంటలను బుధవారం డీఆర్‌సీ ఏఓ సుచిత్ర, మండల వ్యవసాయ అధికారి రాజకుమారిలతో కలసి వీరయ్య సందర్శించారు. వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వరిలో దశలవారీగా వచ్చే పురుగు, తెగుళ్ల నివారణను గురించి రైతులకు వివరించారు. నీటి, కలుపు యజమాన్యంపై అవగాహన కల్పించారు. వరిలో వేరుకళ్లు సోకినట్లయితే నీటిని తీసి పలం ఆరబెట్టి తరువాత నీటిని నింపుతుండాలని తెలియజేశారు. తాళ్లపాక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

నందలూరు : ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారిణి సుచిత్ర పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాటూరు పంచాయతీ కుమ్మరపల్లి గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం అధికారులు పర్యటించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామ సభలో రైతులకు వరిపంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. అదే విధంగా కడప కేవీకే కేంద్రం నుండి వ్యవసాయ శాస్త్రవేత్త వీరయ్య రైతుల వరిపంట పొలాలను పరిశీలించి పాము పొడ తెగులు నివారణకు సూచనలు అందించారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ సీజ్

గాలివీడు : అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని తలముడిపి గ్రామం వద్ద పాపాఘ్ని నది నుంచి గాలివీడుకు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మార్గమధ్యలోని గరుగుపల్లి క్రాస్ వద్ద ట్రాక్టర్‌ను పట్టుకుని వెంకటరమణపై కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

లక్కిరెడ్డిపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు రక్షణ కల్పించాలని పౌరహక్కుల సంఘం ఉమ్మడి వైఎస్సార్ జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్ కోరారు. లక్కిరెడ్డిపల్లి గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటన నేపథ్యంలో బుధవారం డీఎస్పీ సుధాకర్‌ను కలిశారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ను, ఆమె భర్తను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం సభ్యులు పల్లపు నాగార్జున, బి రవి పాల్గొన్నారు.

పాఠశాలలో వన మహోత్సవం

రామాపురం : గురుకులాన్ని క్లీన్, గ్రీన్‌గా మార్చుకుందామని ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం వంద మామిడి, ఉసిరి, సపోట, నేరేడు, చీనీతోపాటు పలు రకాల వేప, చింత, కానుగ మొక్కలతోపాటు పలు పూల రకాల మొక్కలను ప్రిన్సిపల్ వరప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మురళీధర్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమలకు భజన బృందం

రైల్వేకోడూరు అర్బన్ : తిరుమలలో అఖండ భజన మహోత్సవంలో పాల్గొనడానికి కోడూరుకి చెందిన శ్రీరామలింగేశ్వర స్వామి భజన బృందం బుధవారం పయనమైంది. వెళ్లినవారిలో అదుకోట నరసింహులు, సుగవాసి మల్లికార్జున, రామసుబ్బారెడ్డి, సోమేశ్వరప్రసాద్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణనాథుని పూజిద్దాం

రాయచోటి టౌన్ : వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించే వారు గణనాథుని మట్టి ప్రతిమలను ప్రతిష్టించి, పూజించి పర్యావరణాన్ని కాపాడాలని మానవత సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రాయచోటి ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో మట్టి ప్రతిమలను తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మానవత ఆధ్వర్యంలో ఈ నెల 6న బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో, చెక్ పోస్టు శివాలయం వద్ద మట్టి గణనాథులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వరద సహాయక చర్యల్లో రాయచోటి అధికారులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ నగర పరిధిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యల్లో రాయచోటి మున్సిపల్ అధికారులు పాల్గొంటున్నారు. రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, ఆర్ఐ మల్లికార్జునలు విజయవాడ 16వ డివిజన్ పరిధిలో సచివాలయం, కృష్ణలంక, భూపేష్‌గుప్తా నగర్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు ఆధ్వర్యంలో జరుగుతున్న సహాయక చర్యలు, ప్రత్యేక శానిటేషన్ పనులు, పాలు, ఆహారం, అత్యవసర మందుల పంపిణీ వంటి పనులను పర్యవేక్షిస్తున్నారు.

వలంటీర్ల సేవలను వినియోగించుకోవాలి

రాజంపేట రూరల్ : వరద ప్రభావిత ప్రాంతాలలో వలంటీర్ల సేవలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ కోరారు. స్థానిక మన్నూరులో బుధవారం విలేకర్లతో ఆమె మాట్లాడారు. వరద నీటిలో చిక్కుకున్న బాధితులకు సరిపడా సాయం అందించగల సత్తా వలంటీర్లకు మాత్రమే ఉందని తెలియజేశారు. వలంటీర్లకు బాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేలు వేతనం చెల్లిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

డీసీఓను సస్పెండ్ చేయాలి

లక్కిరెడ్డిపల్లి : గురుకుల పాఠశాల విద్యార్థినుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థినులను వారి తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకువెళ్తుండటం గురుకులంలో ఉన్న భద్రతా డొల్లతనాన్ని బయటపెట్టిందన్నారు. పాఠశాలలో బాలికపై లైంగిక దాడి సంఘటనకు సంబంధించి ప్రిన్సిపల్, ఆమె భర్తపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలానే పాఠశాల డీసీఓ మాధవీలత పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని, సదురు అధికారిని సస్పెండ్ చేయాలంటూ కోరారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నేటి నుంచి ఉత్సవాలు

పెనగలూరు : పెనగలూరు పంచాయతీ పి.కొత్తపల్లిలో వినాయక చవితిని పురస్కరించుకొని నేడు గురువారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్య లు తెలిపారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త తలమంచి గిరీష్‌రెడ్డి వినాయక విగ్రహాన్ని గురువారం సాయంత్రం తీసుకురానున్నట్లు వారు తెలిపారు. భారీ విగ్రహాన్ని ఎంపీడీఓ కార్యాల యం నుంచి బాణా సంచా పేల్చుతూ ఊరేగింపుగా పురవీధులు గుండా ఆలయానికి తీసుకురానున్నట్లు చెప్పారు. నూతనంగా నిర్మించిన వినాయక స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపా లతో సుందరంగా అలంకరించారు. కేరళ నుంచి ప్రత్యేక వాయిద్యాలతో ఈ విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.